క్లుప్తంగా

పోలేరమ్మకు పొంగళ్లు



జరుగుమల్లి: శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాల అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ పోలేరమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలేరమ్మ దర్శనానికి 6 వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్ర నామార్చనలు, మొదలగు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వల్లూరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబాగుడికి శ్రీకృష్ణుడి విగ్రహం బహూకరణ



ఆలయ కమిటీకి విగ్రహాన్ని అందచేస్తున్న ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానానికి శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహాన్ని ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు, మానవతా సంస్థ అధ్యక్షుడు గుత్తి శ్రీధర్ ఆదివారం బహూకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గుత్తి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తి శ్రీధర్ మాట్లాడుతూ దైవ కార్యక్రమాలకు, పేదలకు తమ వంతు సాయం ఎల్లప్పుడు అందచేస్తామన్నారు. తొలుత జరిగిన కమిటీ సమావేశంలో ఆలయంలో నవగ్రహ మండప ఏర్పాటు, పాత కళ్యాణ మండపం ఆధునీకరణ, కృష్ణాష్టమీ వేడుకల నిర్వాహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బాబా దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, నాయకులు ముచ్చర్ల ధర్మ, టంగుటూరు గోవిందరావు, వీసీ రామశాస్త్రి, ఏసీ చెంచులు, ఈర్ల గురవయ్య, పులి ప్రసాద్‌రెడ్డి, గంగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, సంజీవయ్య, కనమర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం (పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ కార్యక్రమం రుత్వికులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయంచుట్టూ నైవేద్యంతో ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. మొత్తం 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఉలవపాడు-1 పరిధిలో సి 16 (బీసీ జనరల్), ఉలవపాడు 3 పరిధిలో సీ 10(బీసీ జనరల్), సీ 13 (బీసీ జనరల్), రామాయపట్నం సీ 11 (ఎస్సీ జనరల్ కు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు 5 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

- ప్రశంసలందుకుంటున్న గ్రామదేవత అంకమ్మతల్లి నూతన దేవాలయ నిర్మాణం
- రూ 5.కోట్లకు పైగా నిధులతో శాతవాహనులు, పల్లవులు, చోళుల కాలం నాటి ప్రాచీన ద్రావిడ కళాశైలిలో ఆలయ నిర్మాణం
- భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఆలయ శిల్పకళా సౌందర్యం
- సప్తమాతృకలు, అష్టలక్ష్ములు, నవదుర్గలు, అష్టాదశ శక్తిపీఠాలు వంటి తదితర దేవతామూర్తుల విగ్రహాలు భాగం
- విశేషంగా ఆకట్టుకున్న యాళీ స్తంభాలు, కుంభమాద్యాది స్తంభాలు
- ఈ నెల 7న ప్రారంభానికి సిద్ధమైన అంకమ్మతల్లి ఆలయం

కళాత్మకం... అద్భుతం



ద్రావిడ కళా శైలిలో రూపుదిద్దుకున్న అంకమ్మతల్లి ఆలయం

కందుకూరు పట్టణ నడిబొడ్డున ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అంకమ్మ తల్లి దేవాలయం రూపుదిద్దుకుంది. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సంకల్పంతో సుమారు రూ.5 కోట్లకు పైగా విరాళాలు రావడంతో అద్భుతమైన శిల్పకళా వైభవంతో ప్రారంభానికి సిద్ధమైంది.

కందుకూరు: దక్షిణ భారతదేశంలో దేవాలయ నిర్మాణాల్లో అధికంగా పాటించే శాతవాహనులు, పల్లవులు, చోళుల కాలం నాటి దేవాలయ నిర్మాణాల్లో అనుసరించిన ద్రావిడ శిల్ప కళా శైలిలో రూపుదిద్దుకున్న గ్రామదేవత అంకమ్మతల్లి నూతన ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయ నిర్మాణంలో భాగంగా చెక్కిన రాతి శిల్ప కళా సౌందర్యం, ప్రాచీన దేవాలయాల శిల్పాకళా సౌందర్యానికి ఏమాత్రం తీసిపోని రీతిలో ఉండడంతో ప్రతి ఒక్కరినీ ముగ్ధులను చేస్తోంది. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సంకల్పంతో దాదాపు రూ.5.కోట్లకు పైగా ఖర్చుతో నిర్మితమైన ఈ అద్భుత శిల్పకళకు నిలయంగా మారిన అంకమ్మతల్లి నూతన ఆలయం ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధమైంది. సెప్టెంబర్ 7వ తేదీ ఆలయ ప్రారంభంతో పాటు, అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్రావిడ కళా శైలిలో నిర్మాణం

పూర్వం నుంచి భారతదేశ దేవాలయాల నిర్మాణాల్లో ద్రావిడ, నాగర, వేసరి శిల్ప కళాశైలిలో ఆలయాల నిర్మాణాలు చేయడం హిందూ సాంప్రదాయంలో భాగం. అయితే దక్షిణ భారత దేశంలో మాత్రం ద్రావిడ శిల్ప కళాశైలిలోనే అధిక నిర్మాణాలు ఉంటాయి. ఈ శైలిని దక్షిణభారత దేశాన్ని పాలించిన శాతవాహనులు, పల్లవులు, చోళులు వంటి రాజులు తమ దేవాలయాల నిర్మాణాల్లో అనుసరించారు. నాటి ప్రాచీన ద్రావిడ శైలినే నేడు అంకమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి శిల్పులు వాడారు. పూర్తిగా రాతికట్టడంతో ప్రాచీన దేవాలయాల్లో కనిపించేలా శిల్పకళా నైపుణ్యాన్ని ఇక్కడ వాడారు. ఇదే ప్రస్తుతం ఆలయానికి అత్యంత శోభను తీసుకువచ్చింది.

పట్టణ నడిబొడ్డున ఆధ్యాత్మిక శోభను వెదజల్లేలా ప్రణాళిక

దాదాపు 400 ఏళ్ల నాటి గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయం పట్టణ నడిబొడ్డున ఉంది. వందల కోట్ల విలువ చేసే స్థలం, కొంత పొలాలు అమ్మవారి ఆస్తులుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధి ప్రణాళికకు రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. విశాలమైన స్థలంలో పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే పట్టణంలో ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని భావించి ఆ మేరకు నూతన ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. సరిగ్గా రెండేళ్లలో భక్తుల ఊహించిన దానికంటే అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశారు.



గర్భగుడి ముందు ఏర్పాటు చేసిన యాళీ స్తంభాలు





ఆలయ నిర్మాణంలో ఉపయోగించి శిల్పకళతో కూడిన కుంభమాద్యాది స్తంభాలు

శిల్ప కళా సౌందర్యానికి నిలయం....

నూతన ఆలయంలో పలు ప్రాచీన శిల్పాకళా నైపుణ్యాన్ని శిల్పులు పాటించారు. పూర్తిగా రాతికట్టడమైన ఈ ఆలయ నిర్మాణంలో బేస్‌మట్టం నుంచే స్త్రీబంధ ఉపపీఠం అనే శైలిలో చేపట్టారు. అక్కడి నుంచి పూర్తి శ్లాబ్ వరకు రాతి స్తంభాలను వాడారు. వీటి కుంభమాద్యాది స్తంభాలని, ముందుభాగంలో పెట్టిన స్తంభాలను యాళీ స్తంభాలు అంటారు. గర్జించే సింహాలను ఈ స్తంభాల్లో చెక్కారు. ఇలాంటివి 8 స్తంభాలను ఏర్పాటు చేశారు. కుంభమాద్యాధి స్తంబాల్లో అనేక మంది స్త్రీ దేవతా మూర్తులను ప్రతిబింబించేలా శిల్పకళను చెక్కారు. ఇక శ్లాబు నిర్మాణంలో చిత్రకూట సాలహారం పద్ధతిని పాటించారు. ఈ సాలహారంలో సప్తమాతృకలు, అష్టలక్ష్ములు, నవదుర్గలు, దశమహావిద్యలు, అష్టాదశ శక్తి పీఠాలు, అక్షర దేవతలు, అంకమ్మ, వల్లూరమ్మ వంటి గ్రామదేవతల విగ్రహాలను చేశారు. ఆ తరువాత అత్యంత సుందరమైన 3 అంతస్తుల విమానగోపురం దర్శనమిచ్చేలా తీర్చిదిద్దారు. ఇక అమ్మవారి గర్భగుడిని మూలముఖ భద్రాలు, కుంభలక స్తంభాలు శైలిలో నిర్మాణం చేశారు. ఆలయ పై కప్పులో శిల్పుల నైపుణ్యానికి నిదర్శనంగా రాతి పద్మ, గరుడ పక్షి, ఒకే తలకు 3 శరీరాలు ఉండే వంటి శిల్ప కళను పెట్టారు. ఇక చుట్టూ శైవ ఆగమ ప్రాకారం నిర్మాణం చేశారు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామిల ఉపాలయాలను నిర్మించారు. నిర్మాణంలో గోచరిస్తున్న ఈ శిల్పకళే ప్రస్తుతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.

అమ్మవారి విగ్రహ తయారీ ప్రత్యేక శిల


శతాబ్దాల భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి నూతన విగ్రహ తయారీకి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. విగ్రహ తయారీకి తమిళనాడు రాష్ట్రంలోని కంచి సమీపంలో ఉన్న తిరువణ్ణమలై నుంచి శిలను తెప్పించారు. ఈ శిలను జీవకళ ఉట్టిపడేలా, ఆ గాంభీర్యతను చాటుతూ ఉండేలా అమ్మవారి నూతన విగ్రహాన్ని తీర్చిదిద్దారు. వందల సంవత్సరాల క్రితం ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహం ఇసుకరాతితో కూడినది కావడం వల్ల క్రమంగా మరమ్మతులకు లోనైంది. దీంతో పరిశీలించిన దేవాదాయశాఖ స్తపతులు నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఆ మేరకు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా 7 అడుగుల అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు.

భవిష్యత్‌లో మరింత విస్తరణ

పట్టణంలో ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా అంకమ్మ తల్లి ఆలయాన్ని తీర్చిదిద్దాలనేది ప్రధాన లక్ష్యం. ఇప్పటికే అమ్మవారి ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. 70 అడుగుల పొడవున అలవేటి మండపం నిర్మాణం, రాజగోపురం నిర్మాణం చేయాల్సి ఉంది. వీటితో పాటు ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆలయ ఆదాయం పెంచేలా ప్రధాన రోడ్డును ఆనుకుని 30 వరకు అద్దెరూమ్‌లను నిర్మించనున్నారు. భవిష్యత్ నిర్మాణాలకు రూ 11కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

విరాళాల వెల్లువ

దాదాపు కోటి, రెండు కోట్ల అంచనాతో ప్రారంభించిన ఆలయ నిర్మాణం ఇప్పటికే రూ 5.20కోట్లు దాటిపోయింది. అయితే ఆలయ నిర్మాణం చూసిన భక్తులు కూడా అమ్మవారిపై అచంచలమైన భక్తిని చాటుకున్నారు. విరాళాల రూపంలోనే రూ 3.12 కోట్లు నగదు, 470 గ్రాముల బంగారాన్ని ఇచ్చారు. బంగారు అమ్మవారి పాదాల కింద ఉంచే బీజాక్షర సువర్ణ యంంత్రాన్ని, మకరతోరణానికి బంగారు తాపడం, విమానగోపురంపై బంగారు కలశాన్ని చేయిస్తున్నారు.



ప్రదక్షిణా మండపంలో చెక్కిన శిల్పకళా నైపుణ్యం, ఒకే తలతో పలు శరీరాలు, పద్మం, గరుడపక్షి, అమ్మవారి శిల్పాలు





శిల్పాలు చెక్కుతున్న శిల్పులు



ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట(ఫైల్)

కనకదుర్గమ్మ ఆలయం తరువాత ఇదే



రాష్ట్రంలో రాతికట్టడంతో ఉన్న ఏకైక అమ్మవారి ఆలయం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం మాత్రమే. ఆ తరువాత రెండవ ఆలయం కందుకూరులోనే పూర్తిగా రాతికట్టడంతో నిర్మించారు. నాకు తెలిసి ఇంకెక్కడా రాతి కట్టడంలో అమ్మవారి ఆలయం లేదు. ఇప్పటి వరకు 130 ఆలయాలు నిర్మించాను. ఏ ఆలయంలో కూడా ఇంత శిల్పకళను ఉపయోగించలేదు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వల్ల మేం కూడా ఆలయాన్ని తీర్చిదిద్దాలనే పట్టుదలతో పనిచేశాం. శ్రమకు ఫలితంగా ఆలయ నిర్మాణం చాలా సుందరంగా వచ్చింది.

– శ్రీనివాసరావు, ఆలయ శిల్పి

ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

- విద్యార్థుల మంచి నడవడిక ద్వారానే మెరుగైన సమాజం
- మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని వారికి అందించాలి
- జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పాలి
- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైందని, ఉపాధ్యాయులు మంచి నడవడిక కలిగిన విద్యార్థుల తయారు చేయడం ద్వారా మెరుగైన సమాజానికి అది బాటలు వేస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులను సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక తిరుమల పంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారికి మానసిక ధృడత్వంతో పాటు శారీరక ధృడత్వాన్ని అందించాల్సి అవసరం ఉందన్నారు. విద్యతో పాటు ఆటలకు యాజమాన్యాలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొంత సమయానికి విద్యార్థుల ఆటలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సమాజంలో వస్తున్న మార్పులను వారికి తెలియజేయాలని, జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యం వారిలో రావాలన్నారు. అప్పుడే జీవితంలో రాణించగలుగుతారని, కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైతే ప్రయోజనం ఉండదన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనలో ఆయా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల శ్రమ ఎంతో ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని, కొత్త ఉత్సాహాన్ని వారికి ఇటువంటి సన్మానాలు ఇస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం పలు పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఎంఈఓలు ప్రసాదరావు, సుబ్బారెడ్డి, పలు ప్రైవేట్ పాఠశాలల యజమానులు నల్లూరి కృష్ణమూర్తి, రామారావు, ప్రసాద్, చంద్రమౌళి, రాఘవులు, యల్లయ్యనాయుడు, హరిబాబు, మర్రిరెడ్డి, షాలిని, శివరామయ్య, మాలకొండయ్య, మాధవరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయానికి కోట సురేంద్రబాబు, విజయలక్ష్మిలు రూ. 12,511, పాకల మాధవరావు, వరలక్ష్మి దంపతులు, పసుపులేటి మమేస్, మాలతిలు, దాసరి రామకృష్ణ, ప్రసన్నకుమారిలు ఒక్కొక్కరు రూ. 5,116 చొప్పున విరాళం అందజేశారు. అలాగే రమేష్‌బాబు, గాయత్రి దంపతులు రూ.5,000, తోట శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు రూ.6250, విప్రనారాయణ, మాధవీలతలు రూ.1300 విరాళంగా అందించారు.

ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, సూరం వేణుగోపాల్‌రెడ్డి, కొడాలి కోటేశ్వరరావు, ఆవుల మాధవరావు, గంగవరపు వెంకట్రావ్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊపిరి పీల్చుకున్న పంటలు

వలేటివారిపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగం . మండలంలోని బొంతవారిపాలెంలో కూరగాయల పంటలు వేసిన రైతులు వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్లో జామాయిల్ వేసిన పంట మొడు ముఖం పట్టడంతో ఈ వర్షం జామాయిలల్ పంటకు చాలా ఉపయోగపడింది. అలాగే ఈ మధ్య కాలంలో మిరపనారు దొడ్లు సాగు చేసుకున్న రైతులకు ఎండల తీవ్రంగా ఉండటంతో నారు అక్కడకక్కడ కొంత ఎండిపోయింది. ఈ వర్షం మిరపనారు దొడ్లకు 90 శాతం ఉపయోగపడుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పొగ నారు బెడ్లు తయారు చేసుకున్న రైతులకు కూడా ఈ వర్షం ఆనందాన్ని ఇచ్చింది. వాతావరణం శాఖ వారు మరో రెండు రోజులు వర్షమని చెప్పడంతో దుక్కులు దున్నుకునేందుకు, పొగాకు, కంది వేసే రైతులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

హనుమంతునిపాడు: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అధికారుల లెక్కల ప్రకారం 68.4 మిల్లీమీటర్ల వర్షపాతం మండలంలో నమోదైంది. చాలా రోజులుగా రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వర్షం వరి నాట్లు వేసుకునే రైతులకు, మాగాణి భూమి దమ్ముకు ఎంతో ఉపయోగంగా ఉంది. రైతు భరోసా కేంద్రాలో రైతులకు అవసరమైన ఎరువులు కూడా అధికారులు సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాలో 12 టన్నులు యూరియా నిల్వ ఉంచారు.

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. శనివారం రాత్రి, ఆదివారం రెండు రోజుల్లో కురిసిన వర్షానికి మెట్టపైర్లకు ఊరటనిచ్చింది. నిమ్మ, బత్తాయి, దానిమ్మ పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూర్చగా, మండలంలోని చెక్ డ్యామ్‌లకు కొద్దిపాటి నీరు చేరింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా రైతులు దుక్కులు దున్నేందుకు సమాయత్తమవుతున్నారు.

అపూర్వ స్నేహం

పొన్నలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 15 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ అదే పాఠశాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు గడ్డం వేణుగోపాల్, ముళ్లమూరి సుమలత, కదిరి శ్రీలత చొరవ తీసుకుని ముందుకు వచ్చి తమతో చదువుకున్న విద్యార్థులతో సంప్రదింపులు జరిపి ఒకచోటకు తీసుకొచ్చారు. ఈ ఆత్మీయ కలయిక ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. 2006-2007లో పదో తరగతి చదివిన వీరంతా పాఠశాల్లో కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుమారు 45 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఘనంగా స్వాగతం పలికారు. అప్పటి గురువులైన ఎం.రాధాకృష్ణశర్మ, సుబ్బారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, డి.లక్ష్మీనారాయణ, సురేష్, శేషగిరిరావు, సత్యమూర్తి, రాంబాబు, ఈవీ ప్రసాద్‌కు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించడంతోపాటు జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు.

ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో పరిశుభ్రతకు చర్యలు



వ్యర్థాలు, పిచ్చిచెట్ల తొలగింపు చర్యలు తీసుకుంటున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ కార్యాలయ సముదాయల ప్రాంగణాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణాల్లో ఆదివారం పరిశుభ్రత చర్యలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కార్యాలయ ఆవరణల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొనడంతో రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తక్షణ చర్యగా తొలగింపులు చేపట్టినట్లు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు అబ్రహం లింకన్, ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు రమణారెడ్డి, మంద్రు రమేష్, మాలకొండయ్య, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను పాల్గొన్నారు.